54)నాదరామక్రియ

ప॥ ఎదురుబడి కాగిళ్ళ యేరులాయ మీ వలపు। అదను బదనుగూడి అడుసాయె వలపు॥

చ॥ చిక్కని చెమటలను చిప్పిలీని వలపు। చొక్కపు కరగులను జొబ్బిలీని వలపు।
చక్కని సరసముల జాలు వాలీ వలపు। తెక్కుల మచ్చికలచే దీగె వారీ వలపు॥

చ॥ జవ్వనము కళల రసములబ్బీ వలపు। నివ్వటిల్లు కోరికల నీరుకమ్మీ వలపు।
రవ్వల తమకముల వువ్విళ్ళూరీ వలపు। చివ్వన దరితీపుల జిడ్డుకట్టీ వలపు॥

చ॥ పంతపు రతులనే పాలుగారీ వలపు। బంతి మోవులనే కడు బచ్చిదేరీ వలపు।
ఇంతలో శ్రీవేంకటేశ యెనసి మీరుండగాను। దొంతరచుట్టరికాన దొప్పదోగీ వలపు॥